"అపకారికి ఉపకారము నెపమెన్నక" చేయడం నేర్పరితనమే కాదు తీర్పరితనంకూడా!

# దీవెన

ఆ రోజు ఉదయం నుండీ అనసూయ చాలా కోపంగా వుంది. ఆమె కోపానికి ఆ ఇంట్లో వున్న చెంబులూ, గిన్నెలే కాక పిల్లలు కూడా గురి అవుతున్నారు.

ముందుగదిలో పేపరు ముఖానికి అడ్డుపెట్టుకుని కూర్చున్న ముకుందం భార్యనే గమనిస్తున్నాడు.

అనసూయకి కోపం రావడం, ఇల్లు రణరంగంలా తయారవడం, ఆ తర్వాత పదినిముషాలకు ఆ కోపం తగ్గిపోవడం అలవాటే.

కానీ ఈ రోజు కోపం చాలా యెక్కువగా వుంది. ఇప్పుడిప్పుడే తగ్గే సూచనలు లేవుఅని గ్రహించాడు. దానిక్కారణం అనసూయ ఎంత కోపంలో వున్నా, చిన్నకొడుకు దగ్గరకు వస్తే మాత్రం వాడిని ఎత్తుకుని ముద్దులాడుతుంది.

అటువంటిది ఈ రోజు ఆ కొడుక్కి కూడా మిగతా పిల్లలకి దొరికిన బహుమతే— పిల్లలు ఏడుస్తూ వచ్చి తండ్రికి ఫిర్యాదు చేశారు.

ముకుందం వాళ్ళని ఓదార్చే స్థితిలోలేడు! ఈ కోపం యెటువంటి పరిణామానికి దారి తీస్తుందా? అని భయపడుతున్నాడు.

గడియారం తొమ్మిదిగంటలు కొట్టింది! ముకుందం వులిక్కిపడ్డాడు.

"అప్పుడే తొమ్మిదయింది. ఈరోజు కాలే కడుపుతోనే ఆఫీసుకెళ్ళాలేమో? ఏం చేస్తాం! ఏ జన్మలో ఏం పాపం చేసుకున్నానో ఇటువంటి పెళ్ళాం దొరికింది" విసుక్కుంటూ లేచి అనసూయకి కన్పించకుండా చుట్టూ తిరిగి దొడ్లోకి వెళ్ళాడు! ఎలాగో స్నానం అయిందనిపించి బట్టలేసుకుని బయటపడ్డాడు ముకుందం.

ఇంట్లోంచి ఇంకా తిట్లు, మోతలూ విని పిస్తూనే వున్నాయి!

* * *

అనసూయకి ఆ పేరు తల్లితండ్రులు ఏ ముహూర్తంలో పెట్టారోగానీ ఆ పేరుకి పూర్తి విరుద్ధంగా తయారయింది. ఈ గుణం ఆ పిల్లలో చిన్నప్పుడే బయటపడింది.

అనసూయకి ఇద్దరన్నయ్యలు, ఇద్దరు తమ్ముళ్ళు!

తండ్రి సామాన్య ఉద్యోగి. అయినా ఉన్నదాంట్లోనే పిల్లలకి ఏ లోటూ రాకుండా చేసేవాడు!

కానీ ఇంట్లోకి ఏం కొనాలన్నా అయనకి భయమే. అనసూయ తనకోసం తెచ్చిన దాంతో ఎప్పుడూ తృప్తిపడేదికాదు! తన కన్నా తమ్ముళ్ళకి ఎక్కువ ఇచ్చారనో, అన్నయ్యలకి ఇంకా మంచివి కొన్నారనో తగవు వేసుకునేది!

ఇంట్లోవాళ్ళు అనసూయ గొడవ భరించ లేక ఆ పిల్ల కోరినట్లే చెయ్యడానికి ప్రయత్నించేవారు. అయినా ఆ పిల్లకు తృప్తి వుండేదికాదు. ఇక రానురాను ఇంట్లోవాళ్ళు అనసూయని పట్టించుకోడం మానేశారు!

అనసూయ. . ఈ గుణం ఇంట్లోనే కాదు, స్కూల్లోనూ చూపెట్టేది! తనకన్నా ఎవరేనా మంచి బట్టలు కట్టుకుంటే సహించేదికాదు! వాళ్ళు చూడకుండా ఇంకు చల్లడమో, బ్లేడుతో చింపడమో చేసేది. ఆ పిల్లలు అది చూసుకుని ఎవరు చేశారో తెలీక ఘొల్లున ఏడ్చేవారు. వాళ్ళు ఏడుస్తోంటె అనసూయ ఆనందిస్తుండేది.

ఎక్కువ మార్కులు వచ్చే పిల్లల్ని కూడా వదిలేదికాదు! వాళ్ళ పుస్తకాలు చించేది! వాళ్ళ పెన్సిళ్ళు, రబ్బర్లు తీసుకుని దాచేది! వాళ్ళు కంగారుగా వెతుక్కుంటుంటే ఆనందించేది.

అనసూయ పెద్దక్క పెళ్ళయ్యేసరికి అనసూయకి యింకా పూర్తిగా జ్ఞానం తెలీదు.


రెండో అక్క పెళ్ళి అనసూయ హైస్కూల్లో చదివే రోజుల్లో అయింది. పెళ్ళిలో అక్కయ్యకి చక్కని నగలు, చీరలు పెట్టారు. అందరూ అక్కయ్య చుట్టూనే తిరుగుతూ అనసూయ నెవ్వరూ పట్టించుకోలేదు! అది అనసూయని దారుణంగా బాధించింది.

పెళ్ళయ్యాక నాలుగురోజులు అనసూయ అన్నం, నీళ్ళు ముట్టకుండా (రహస్యంగా టిఫిన్లు తింటూ) అలిగింది.

"ఏమిటీ!" అని కారణం అడిగితే....

"నాకూ అర్జంటుగా పెళ్ళి చెయ్యాలి! పెళ్ళిలో అక్కయ్యకి చేసినవన్నీ నాకూ చెయ్యాలి!"







విన్నకోట సుశీలాదేవి

అదీ ఆ పిల్ల ఏడుపు!

అనసూయ గుణం తెలిసిన తల్లీ తండ్రీ పక్కకు తిరిగి నవ్వుకున్నారు. కూతురితో మాత్రం "అలాగే తల్లీ చేస్తాం—నువ్వు ముందు అన్నం తిను!" అని బతిమాలి అన్నం తినిపించారు.

వాళ్ళకోసమే తను తిండితింటున్నట్లు ఎంతో బాధగా తింది.

అనసూయ కోరికమీదే స్కూలుఫైనల్దాకా ప్యాసవని అనసూయ తాలూకాలో గుమస్తాగా పనిచేసే ముకుందానికి భార్య అయింది. అయితే అనసూయకి ముకుందాన్ని చూశాక పెళ్ళవుతోందనే సంతోషం ఏ కోశానా లేకుండాపోయింది.

ముకుందం సన్నగా, పొడుగ్గా గెడకర్రలా వుండేవాడు!

అక్క మొగుడిలా లేడు. కనీసం కరణం గారి అమ్మాయి పార్వతి మొగుడిలానైనా లేడు. ఎలా చేసుకునేది? అనసూయ ఆలోచిస్తుండగానే పెళ్ళయింది.

భర్తతో పట్నానికి కాపురానికి వచ్చింది. వచ్చిన మూడోరోజునే ముకుందం ఒట్టి చవట అనీ, తెలివితక్కువ వాడనీ నిర్ధారణ చేసుకుంది. తనకిటువంటి మొగుడిని కట్టబెట్టినందుకు తండ్రినీ, దేవుడినీ కసిదీరా తిట్టేసింది.

అనసూయ తిట్లూ, చికాకులూ ముకుందానికి చీమకుట్టినట్లయినా వుండేవి కావు.

ఆఫీసులో హెడ్ గుమస్తాచేత, తాసిల్దారు చేత రోజూ ఇంతకంటే ఎక్కువ తిట్లే తినేవాడు! అదీకాక అతడికి అలా తిట్టించుకుంటేనే బాగుంటుంది. అందుకనే అనసూయ కోపాన్నీ తిట్లనీ పెద్దగా పట్టించుకోలేదు.

అనసూయ ఇరుగు పొరుగువారి ఐశ్వర్యానికి అసూయపడ్తూ, తన కవి లేవని దిగులుపడుతూ వుండేది.

నిర్మలంగా సాగే నీటిలో రాయి పడినట్లు ఒక సంఘటన జరిగింది.

వారం రోజుల క్రితం.

ప్రక్కవాటాలోకి శారదవచ్చి చేరింది.

శారద ప్రైవేటు కంపెనీలో స్టైనోగా పని చేస్తోంది! పాతికేళ్ళ వయసు. సన్నగా, తెల్లగా మల్లిమొగ్గలా వుంటుంది! విశాలమైన కళ్ళు. ఎదుటివారిని సమ్మోహనపరిచే చిరునవ్వు. దానికితోడు చక్కగా ముస్తాబై చూచేవాళ్ళకి రెండుకళ్ళు చాలవనిపిస్తుంది.

ఆ రోజు ఆదివారం.

శారద ప్రొద్దున్నే చక్కగా అలంకరించుకుని, తను చేసిన టిఫిన్ గిన్నెలో పెట్టుకుని - "అక్కయ్యగారూ!" అంటూ అనసూయ ఇంట్లోకి వచ్చింది.

ఆ సరికి అనసూయ యుద్ధరంగంలో శత్రువులతో యుద్ధం చేస్తున్న సైనికుడిలా వుంది.

మాసిన చీర పైకి దోపింది. ముఖం నిండా మసి, చెమట. పిల్లలు ఇంకా నిద్ర లేవలేదు.

వంటింట్లోంచి తిడ్తూ వాళ్ళని నిద్ర లేపుతోంది అనసూయ.

ముకుందం అప్పుడే లేచి ముఖంకడిగాడు. భార్య ఇచ్చిన కషాయంలాటి కాఫీ తాగుతున్నాడు.

ఆ సమయంలో ముకుందం గదిలోకి

అడుగు పెట్టింది శారద. ముకుందాన్ని చూస్తూ "అక్కయ్యగారున్నారాండీ!" అనడిగింది

ముకుందం శారదనిచూసి, మొదట తెల్లబోయి, ఆ తర్వాత కంగారుపడి, కుర్చీలోంచి లేవబోయి కాలు మెలిక పడడం వలన, మళ్ళీ కూలబడి పోయాడు! అతని అవస్తచూసి శారద నవ్వుకుంది.

ముకుందం గబగబా లోపలికెళ్ళి భార్యని పిలిచాడు. అనసూయ బయటకొచ్చింది.శారదనిచూసి ముఖం చిట్లించింది. శారద అనసూయకి నమస్కారంచేసి :

"అక్కయ్యగారూ! నేనీ పక్కవాటాలోకి కొత్తగా వచ్చానండీ!మీతో పరిచయం చేసుకోవాలనిపించింది. పొద్దున్నే ఇడ్లీ చేశాను! మీకని తెచ్చాను" అంటూ గిన్నె అందించింది.

అనసూయ ఏదో అనబోయింది! ఇంతలో పెద్దపిల్ల గబుక్కున · ఆ గిన్నె అందుకుని లోపలకు పరిగెట్టింది.

అనసూయ శారదని నఖశిఖ పర్యంతం గుచ్చి గుచ్చి చూసింది. కనీసం మర్యాదకైనా కూర్చోమనలేదు.

ముకుందం అది చూసి అనసూయని తిట్టుకుంటూ— "కూర్చోండి" అన్నాడు శారదతో.

శారద "థాంక్యూ" అని అతనివేపుచూసి చిన్నగా నవ్వి కుర్చీలో కూర్చుంది.

అనసూయ ముకుందంవేపు కొరకొరా చూసింది. ముకుందం శారదతో కాసేపు ఆవిడ ఆఫీసు విషయాలు మాట్లాడాడు.

"అక్కయ్యగారు పనిలో వున్నట్లున్నారు. మళ్ళీ కలుస్తాను" అని లేచి— "వస్తానండీ" అని ముకుందంతో కూడా చెప్పి వెళ్ళిపోయింది శారద.

శారద వెళ్ళినవేపే చూస్తూ కూర్చున్నాడు ముకుందం. అనసూయ అది భరించలేకపోయింది.

"అయిందా చూర్దం! ఎంత వయసొచ్చినా వెధవ బుద్ధులు పోవు. నలుగురు పిల్లల తండ్రుయి అలా చూర్డానికి సిగ్గు లేదూ" అంటూ అరిచింది.

తుఫానువచ్చే సూచనలు గమనించి ముకుందం భయపడిపోయి గబగబా వెళ్ళి బాత్‌రూమ్‌లో దూరాడు.

ఆరోజల్లా అనసూయ మండిపడుతూనే వుంది. శారద చేతిలోంచి గిన్నె తీసుకున్నందుకు పెద్దపిల్ల వీపు అదరగొట్టింది. శారదని చూసినందుకు మొగుణ్ణి కాసేపు తిట్టింది. ఆ తర్వాత శారదని తిట్టసాగింది.

"ఛీ! ఛీ: ఈ కాలపు ఆడపిల్లలు మరీ బరితెగించి పోయారు. ఒళ్ళు కనిపించే ఆ చీరలు, ముఖానికి రంగులు, మగాళ్ళతో పకపకలు పైగా "అక్కయ్య గారులు"! గజ్జెలగుర్రంలా వుంది. దానికంటేకి అక్కయ్యగారిలా కనిపించానా! మా నాన్న నాకు ముందే పెళ్ళిచెయ్యబట్టి, ఈ మొగుడికీ, పిల్లలకీ చాకిరీచేస్తూ ఇలా వున్నాను గానీ, నేనూ దానిలా ఎంత వయసొచ్చినా పెళ్ళి పెటాకులూ లేకుండా వుంటే చిన్నపిల్లలాగానే వుంటాను."


ఇలా నోటికి ఫుల్‌స్టాప్ కామా లేకుండా మాట్లాడుతూనే వుంది.

కానీ మనసులో శారదని గూర్చే ఆలోచించసాగింది.

శారద అందం, ఆమె ఫ్రీగా ఎటువంటి బాదరబందీ లేకుండా తిరగడం, శారద కట్టూ బొట్టూ. ఇవన్నీ అనసూయకి అసూయని కలిగించాయి.

శారద వీలైనప్పుడల్లా అనసూయ దగ్గరికి వస్తూనే వుంది.

"అక్కయ్యగారూ! కొత్త చీర కొన్నాను. ఇది చూశారా?" అనో,




"కొత్త సినిమా వచ్చింది రాత్రి నే వెళ్ళాను! ఎంతో బాగుంది" అనో ఏదో చెప్తుండేది!

పిల్లలకి తినడానికి ఏదైనా తెస్తుండేది. శారద ఆప్యాయంగా మాట్లాడుతున్నా అనసూయ అంటీ అంటనట్లు మాట్లాడుతుండేది.

తనకంటే శారద చాలా అందంగా, మరెంతో సంతోషంగా వుండడం చూస్తున్న కొద్దీ అనసూయలో ద్వేషం పెరిగిపోసాగింది!

రాత్రిపూట నిద్రపోవడం మానేసింది.

శారద మీద తన ద్వేషాన్ని ఎలా చూపాలో? ప్రతీకారం ఎలా తీర్చుకోవాలో అనసూయకు తెలీకుండా వుంది.

శారదకి ప్రత్యక్షంగా ఏమీ చెయ్యలేదు. అందుకే - శారదకి ఏదో పెద్ద కష్టం కలిగినట్లు, శారద ఏడుస్తున్నట్లు వూహించుకుని మానసికంగా సంతోష పడ్తుండేది. అంతతో తృప్తిపడక మధ్యాహ్నంపూట చుట్టుపక్కల వాళ్ళని చేరదీసి—

"చూశారా పిన్నిగారూ! మా యింటి ప్రక్కన చేరిందే శారద....అది వాక్కత్తె వుంటోంది. రోజూ ఏ అర్ధరాత్రి పూటో యింటికి చేరుతుంది. దాన్ని చూస్తోంటె నాకు ఎంత కంపరం కలుగుతోందో చెప్పలేను! ఇక మా యింటికొచ్చి "బావగారూ" అంటూ ఆయన్తో వాకటే రాచుకుని తిరగడం....అబ్బబ్బ భరించలేకుండా వున్నానండీ! ఇక ఈ ఇల్లు ఖాళీ చేద్దామనుకుంటున్నాం!" అనేది.

"ఆ శారదేమిటి? చదువుకుని ఉద్యోగాలు చేస్తున్న ఆడాళ్ళందరూ అలాగే తగలడ్డారు. నీతి, నియమం అన్నీ పోయాయి. మగాళ్ళ మధ్య తిరగడం, వాళ్ళతో కబుర్లు— నవ్వులు. ఛ! ఛ! వాళ్ళలా ఎలా వుంటారో గానీ, పరాయిమగాడు నా వేపు చూస్తే చాలు, నా ఒంటిమీద తేళ్ళూ, జెర్రులూ పాకుతున్నట్లుంటుంది" అంది ఆ పిన్నిగారు.

ఆ పిన్నిగారు నల్లగా,లావుగా వుంటుంది. మగాళ్ళందరూ తనవేపు చూడాలని ఆవిడ కోరిక. కాని ఎవ్వరూ చూడరు. తన మనసులోని బాధని, ఆ విధంగా మాటల్లో తీర్చుకుంటుంది.

ఒకరోజు శారద ప్రొద్దున్నే అనసూయ దగ్గరకు వచ్చింది. తలారా స్నానంచేసి పట్టుచీర కట్టింది.

"అక్కయ్యగారూ మా ఇంటికోసారి వస్తారా?" అంది.

"ఎందుకూ?" అనడిగింది అనసూయ మనసులోని చిరాకుని అణచుకుంటూ.

శారద తలొంచుకుని సిగ్గుపడ్తూ—

"రండి! చెప్తాను!" అంది. ఇష్టం లేక

పోయినా అనసూయ శారదతో పాటు వాళ్ళింటికి వెళ్ళింది.

ఇంతకు ముసుపొకసారి మాత్రం వెళ్ళింది. ఆ ఇంటి శుభ్రత, అలంకరణ చూసి భరించలేక మళ్ళీ వెళ్ళలేదు అనసూయ.

ఈ రోజు ఆ ఇంట్లో ఇంకా ఏవో కొత్త అందాలు కన్పించాయి.

"వీరే! మాఅక్కయ్య పేరు-అనసూయ! ఈ వూళ్ళో నాకున్న బంధువు వీరే!"

"అక్కయ్యా! వీరు శంకరంగారు! మా ఆఫీసులోనే ఉద్యోగం!" అంది శారద.

గది అలంకరణ చూస్తున్న అనసూయ శారద మాటలకు పక్కకు తిరిగి చూసింది.

పొడుక్కు తగ్గ లావుతో అందంగా వున్న శంకరం కన్పించాడు.

"నమస్కారమండీ" అన్నాడు శంకరం.

అనసూయ అప్రయత్నంగా చేతులు జోడించింది.

"అక్కయ్యా! కూర్చోండి!" అంది శారద.

అనసూయ కూర్చుంది.

"మీరు మాట్లాడుకుంటూ వుండండి. ఇప్పుడే వస్తాను" అని శారద లోపలకు వెళ్ళింది.

శంకరం అన్నాడు— "మీ గురించి శారద అప్పుడప్పుడు చెప్తూవుంటుంది. మీరు చాలా మంచివారని, తన క్షేమాన్ని కోరేవారు మీరొక్కరే అని అంటుంది. శారద ఈపాటికి మీతో చెప్పేవుంటుంది. నేనూ శారద పెళ్ళి చేసుకోబోతున్నాం. మీరు మా పెళ్ళికి తప్పక రావాలి."

శారదపెళ్ళి.... అందులోనూ ఇంత అందమైన శంకరం.... శారద భర్త.... అనసూయ మనస్సు భగ్గున మండింది!


శారద రెండు ప్లేట్లల్లో టిఫిను తెచ్చింది. శంకరం తమ పెళ్ళిగురించి చెప్తున్నాడు.

అనసూయకి తింటున్న టిఫిను చేదుగా వుంది. ఇక ఎక్కువసేపు అక్కడ కూర్చోలేకపోయింది. టిఫిను తిని "వస్తానండీ! ఇంట్లో పని వుంది" అంటూ లేచింది అనసూయ.

"ఈరోజే రిజిస్ట్రారాఫీసులో అప్లికేషన్ ఇస్తున్నామండీ. మా పెళ్ళి నిర్విఘ్నంగా జరగాలని మమ్మల్ని ఆశీర్వదించండి!" అన్నాడు శంకరం.

ఇద్దరూ ఆమె కాళ్ళకు నమస్కారం చేశారు.

అనసూయ మనసులో ఎంత తిట్టిందో కానీ పైకి మాత్రం "పిల్లా పాపలతో హాయిగా జీవించండి" అంటూ దీవించి అక్కడినుంచి తన ఇంట్లోకి వచ్చేసింది.




ఇక అక్కడినుంచి రాగానే అనసూయ కోపానికి ఇంట్లోని గిన్నెలూ, చెంబులూ బద్దలయిపోయాయి.

ఆరోజు పిల్లలకి తిండికి బదులు తిట్లే దొరికాయి! ముకుందం భోజనం చెయ్యకుండానే ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

ఆ రోజంతా అనసూయ విపరీతంగా బాధపడింది. కన్ను మూసినా, తెరిచినా, శంకరమే కనిపిస్తున్నాడు.

తను ఎటువంటి భర్త అయితే తనకు రావాలని కోరుకుందో, ఆ లక్షణాలన్నీ శంకరంలో వున్నాయి. కానీ అతడు శారదకి మొగుడు కాబోతున్నాడు.

తను ద్వేషించే శారదకి అంత అందమైన మొగుడు.... ఒళ్ళు భగభగలాడింది అనసూయకి. కళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి.

ఈ దారుణాన్ని చూస్తూ తను భరించగలదా? ఈ ఘోరాన్ని తను సహించగలదా?

చిన్నప్పట్నించీ తన అసూయకి, చాలామందే ఆహుతయ్యారు. వాళ్ళందరిమీదా ఏదో విధంగా ప్రతీకారం తీర్చుకుంది. కానీ శారదమీద తను ఎటువంటి ప్రతీకారం తీర్చుకోలేకుండా వుంది.

అనసూయ మానసికంగా బాధపడుతోంది.

ఈ బాధ వలన అనసూయకేకాక ఇంట్లో వాళ్ళకి కూడా శాంతి లేకుండా పోయింది. ఎవరికీ సరిగ్గా తిండీ తిప్పలూ లభ్యం కావడం లేదు.

ముకుందం ఇంటికి రావాలంటేనే భయపడుతున్నాడు. అనసూయ ప్రతిరోజూ, ప్రతిక్షణం మొగుడినీ, పిల్లల్నీ తిట్టిపోస్తూనే వుంది.

వారంరోజుల తర్వాత ఒక సాయంత్రం శంకరం వచ్చాడు.

ఆపాటికి అనసూయ ముందు గదిలో కూర్చుని బియ్యంలో రాళ్ళు ఏరుతోంది.

శంకరాన్ని చూసి "రండి! రండి" అని ఆహ్వానించింది.

శంకరం వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

"శారద ఇంకా ఆఫీసునుండి రాలేదాండీ" అనడిగాడు.

"లేదనుకుంటా. మీరు ఆఫీసుకెళ్ళలేదా?" అంది అనసూయ.

"లేదండీ. నేను వూరు వెళ్ళాను. ఇప్పుడే బస్సుదిగి వస్తున్నాను!" వాచీ చూసుకుంటూ — "ఆఫీసు టైమయిపోయింది. వచ్చేస్తుంటుంది!" అన్నాడు స్వగతంగా!

అనసూయ శంకరంవేపే చూస్తోంది. శంకరం తనని గూర్చి, తన కుటుంబం గూర్చి చెప్పాడు! చెప్పి —

"వదినగారూ! నాకు శారదతో అసలు వివాహం జరుగుతుందనుకోలేదు. నేనీ ఆఫీసులో చేరి ఆరు నెల అయింది. మొదటి రోజే శారద నన్ను ఆకర్షించింది. చేసుకుంటే ఆమెనే చేసుకోవాలని లేకపోతే ఇక జీవితంలో పెళ్ళి మాటే ఎత్తకూడదని అనుకున్నాను. నా అదృష్టంకొద్దీ శారద తోటి పరిచయం ప్రేమగామారడం జరిగింది నిజంగా నేను చాలా అదృష్టవంతుడిని."


అతడు పరవశంగా చెప్తోంటె అనసూయ వినలేకపోయింది.

శంకరం ఇంకా చెప్తున్నాడు :

"శారద మనిషి ఎంత అందమైందో మనసుకూడా అంత అందమైందండీ. ఇక ఆఫీసులో వర్కుకూడా ఎంతో సిన్సియర్‌గా చేస్తుంది. మా ఆఫీసులో ప్రతీవారూ ఆమె అంటే ఇష్టపడతారు."

అని వాచీ చూసుకున్నాడు.

"ఇంకా రాలేదే?" అనుకున్నాడు.




వింటున్న అనసూయ మనసులో తేలు కొండి తలెత్తింది. గొంతు సర్దుకొని శంకరంతో మెల్లగా అంది—

"శారద ఈ రోజే కాదండీ. ప్రతిరోజూ ఇంతే. ఇంటికి వచ్చేటప్పటికి ఏడు. ఎనిమిది అవుతుంది. ఒక్కొక్కప్పుడు అసలు ఇంటికే రాదు."

శంకరం ఆశ్చర్యంగా చూశాడు.

"ఇక రాత్రి వేళల్లో రోజూ ఆ గదుల్లోంచి ఏవో నవ్వులు. మాటలు వినబడుతుంటాయి. మేం వినలేకపోయేవాళ్ళమనుకో. ఎందుకులే బాబూ. ఒక ఆడపిల్లని ఆడిపోసుకోడం. వెయ్యి అబద్ధాలాడైనా ఒక పెళ్ళి చెయ్యమన్నారు. అసలివన్నీ మీకు చెప్పాలనుకోలేదు. కాని మిమ్మల్ని చూస్తోంటె నా తమ్ముడు జ్ఞాపకం వస్తున్నాడు. అమాయకుడవైన నిన్ను మోసం చెయ్యాలనిపించలేదోయ్" అంది.

ఆ మాటలతో శంకరం తల తిరిగిపోయింది. "వదినగారూ! మీరంటే నాకెంతో గౌరవం. ఇదంతా నిజమేనా? శారద అంత నీతిలేనిదా?"

"ఎందుకులే బాబూ ఇప్పుడివన్నీ. నువ్వు ఎలాగూ శారదని పెళ్ళిచేసుకోదలచుకున్నావు గదా. ఆమె గతంతో నీకేంపని. అదంతా ఏం మనసులో పెట్టుకోకు. ఏదో చిన్నపిల్ల. శారద స్వతహాగా మంచిదే. కాని వయసు వుంది చూశావూ అది చాలా చెడ్డది. దాన్ని అదుపులో పెట్టుకోడం చాలా కష్టం. మనలాటి వాళ్ళం వాటన్నిటినీ క్షమించేయాలి. కానీ నా బాధల్లా ఒక్కటే శంకరం - ఆ కుర్రాడితో అంత స్నేహంగా వుందిగదా. నీతో పెళ్ళయిన తర్వాత అయినా అతన్ని మర్చిపోతుందా? లేదా? అనే" అంది శంకరాన్ని జాలిగా చూస్తూ?

శంకరం ఇక కుర్చీలో కూర్చోలేకపోయాడు. "వదినగారూ. శారద గుణవంతురాలని మా ఇంట్లో వాళ్ళకు ఇష్టం లేకపోయినా వాళ్ళని కాదని చేసుకుంటున్నాను. శీలం లేని ఆడపిల్ల గాలిలో ఎగిరే విస్తరాకుతో సమానం. నా కటువంటి దౌర్భాగ్యం వద్దు. మీరు మంచివారు కాబట్టి శారదని గూర్చి చెప్పి నా కళ్ళు తెరిపించారు. నేను వెళ్ళొస్తానండీ!"

అంటూ చరచరా బయటికి వెళ్ళిపోయాడు. అనసూయ హాయిగా నవ్వుకుంది.

"శంకరాన్ని పెళ్ళిచేసుకుంటున్నానని శారద పొంగిపోతోంది. ఇప్పుడిక శారద ఏమంటుందో? కుళ్ళి కుళ్ళి ఏడుస్తుందా? లేక ఆత్మహత్య చేసుకుంటుందా?" కసిగా అనుకుంది.

గొప్ప ఘనకార్యం సాధించినట్లు ఆనందపడింది.

"ఈమధ్య సరిగ్గా వంట చెయ్యటంలేదు. ఇవ్వాళ పిల్లలకి ఏదైనా మంచి కూరవండి ప్రేమగా పెట్టాలి. తనుకూడా కడుపునిండా అన్నంతిని. కంటినిండా నిద్రపోయి ఎన్నో రోజులయింది. ఇవ్వాళ హాయిగా తిని. కమ్మగా నిద్రపోవాలి" అనుకుంటూ బియ్యంచేట తీసుకుని లోపలకు వెళ్ళిపోయింది.

ఇంతలో బయట అడుగుల చప్పుడు విన్పించింది. అనసూయ తలెత్తి చూసింది.

శారద—లోపలికొస్తోంది. ఆమె భుజం మీద అనసూయ చిన్నకొడుకు.

అది చూసి అనసూయ కంగారుగా చేట క్రిందపెట్టి, శారద దగ్గరకొచ్చి—

"ఏమయింది వాడికి" అంది.

శారద కుర్రాడిని అక్కడవున్న మంచం మీద పడుకోబెట్టింది. అనసూయ వేపు తిరిగి "ఏం లేదండీ? యాక్సిడెంట్ కొద్దిలో తప్పిపోయింది."

"యాక్సిడెంటా?"

"కంగారు పడకండి! ఏంలేదు. బాబు రోడ్డుమీద ఆడుకుంటున్నాడు. ఇంతలో అటువేపు నుండి లారీ వచ్చింది. బాబు తప్పుకోలేకపోయాడు. సమయానికి నేనూ అప్పుడే అక్కడికి వచ్చాను. బాబుని ప్రక్కకు లాగాను. ఇద్దరం అక్కడున్న రాళ్ళగుట్ట మీద పడ్డాం. బాబు నా ఒళ్ళో వుండడం వల్ల వాడికే ప్రమాదం జరగలేదు. నాకే...." అంటూ కాలు చూసుకుంది. కాలినిండా రక్తం. చేతులు కొట్టుకుపోయాయి. నుదుటిమీద పెద్ద గాయం.

"అయ్యో రక్తం వస్తోంది. నీకు చాలా దెబ్బలే తగిలాయి!" అంది అనసూయ.

"ఏం ఫర్వాలేదులెండి మందు వేస్తే అదే తగ్గిపోతుంది. బాబుకి వేడిగా ఏదైనా ఇవ్వండి. తేరుకుంటాడు. వస్తాను!" అం[illegible] తన రూములోకి వెళ్ళిపోయింది శార[illegible]

అనసూయ కింద చూసింది. [illegible]రటి రక్తపు మరకలు. వాటిల్లోంచి శార[illegible] తనవేపు చూసి నవ్వుతున్నట్లనిపించిం[illegible]

"చూశావా. నువ్వు నన్నింత సర్వనాశనం చెయ్యడానికి ప్రయత్నించినా. నీ కొడుకుని రక్షించాను!" అంటోంది శారద.

అవును. శారద దేవత. తనే రాక్షసి! తనెంత అసహ్యంగా ప్రవర్తించింది. శారద జీవితాన్ని నాశనం చేసింది. కానీ శారద ప్రాణాలకు తెగించి తన కొడుకుని కాపాడింది.

"శారదా నీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేను. కాదు తీర్చుకుంటాను. ఇప్పుడే తీర్చుకుంటాను. శంకరం కాళ్ళమీద పడి ప్రార్థించైనా అతన్ని తీసుకొచ్చి. శారదా! నీతో వివాహం జరిపిస్తాను" అనుకుంది.

బాబుకి పాలు వెచ్చబెట్టి యిచ్చింది. ఎదురింట్లో వున్న పెద్ద పిల్లను పిలిచి ఇల్లు చూస్తుండమని చెప్పి శంకరం ఇంటికి గబగబా బయలుదేరింది అనసూయ. ●

